స్కెచ్

# అమూల్యమైన అవకాశం

జీవనిగ మాధవరావు

"చూశావూ! నారాయణా నెహ్రూకు బొత్తిగా యిష్టం లేదోయ్, మనకు ప్రత్యేకంగా రాష్ట్రం యివ్వడం."

"అంతేనంటారా? నాకు తెలియకడుగుతాను, ఆంధ్రరాష్ట్రం వస్తే లాభం ఏమిటండీ? అయినా స్వరాజ్యం, స్వరాజ్యం అన్నారు. అది వచ్చేసిందన్నారు. ఇంకా రాష్ట్రం ఎందుకు? రాజ్యం గొప్పా? రాష్ట్రం గొప్పా? రాజ్యం వస్తే రాష్ట్రం ఎందుకు?"

"పిచ్చివాడివోయ్. ఎంత సులభంగా అనేశావు స్వరాష్ట్రం ఎందుకని. ఇంకా నయం. స్వరాజ్యం యెందుకని అడగలేదు. మంచివాడివి."

"చిత్తం. ఇంతకీ అదెందుకు కావాలో చెప్పలేదు."

"ఎందుకేమిటి? మనం, అంటే మన తెలుగు వాళ్ళం, మన చేతుల్తో, మన భాషతో పరిపాలన చేసుకుంటూ, తెలుగు దేశంలో ఎన్నో ప్రాజెక్టులు కట్టించి, ఎన్నో చెరువులు త్రవ్వించి—"

"రోడ్లు వేయించి, సత్రాలు కట్టించి, రోడ్లకటూ యిటూ చెట్లను—"

"భళ్, సరిగ్గా మాటకడ్డొస్తావు. ఊఁ– ఇక నేనేం చెప్పేదున్నాను నీకు? అవచ్చే 'ఫోర్సు' ఆపేశావు. ఇక నీకు తెలుసుకునే అదృష్టం లేదు. నీకర్మ అంతే."

"చిత్తం, క్షమించండి. మరి మనం యింత బాగా అవి త్రవ్వించీ యివి కట్టించుకుంటూ పరిపాలన చేసుకుంటామంటే, ఆ నెహ్రూ గారికి ఎందుకిష్టం లేదండీ?"

"అదీ అలా అడుగు. మొదటనే నీవు ఈ ప్రశ్న వేయాల్సింది. చెప్తా విను. ఆ నెహ్రూ ఉన్నాడు చూశావ్, ఆయనకి మన తెలుగు వాళ్ళంటే అసలు గిట్టదు."

"చిత్తం."

"అందుకనే. ఆయనెప్పుడూ ఆ ఉత్తర హిందూస్థానంలో విమానాలమీద ఆ నగరానికీ, యీ పట్టణానికీ తిరుగుతూ ఉంటాడు గాని, పట్టుమని నాలుగు రోజులు మన మద్రాసులో ఉన్న పాపాన పోలేదు. అయినా అక్కడి నీళ్ళు అలవాటుపడ్డ మనిషికి యిటు వైపువాళ్ళూ, వాళ్ళ అభిప్రాయాలూ ఎందుకు నచ్చుతాయి చెప్పు?"

"చిత్తం. అదేనండి వచ్చిన చిక్కు. మా మేనల్లుడికూడా ఈ ఊరొస్తే ఒక్క రోజు కూడా కాలు నిలువదు. గుంటూరు వెళ్ళి నీళ్లు లేక చావటానికైనా ఒప్పుకుంటాడు గాని. అదేమిటిరా అంటే—"

"ఆగవోయ్ ఆగు. మొదట నీవడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పనీయకుండా, యింకోదాంట్లోకి లాక్కెళ్తావేం? ఆ నెహ్రూ యీమధ్య యేంచేశాడో తెలుసా? నీకూ, నాకూ, యీ ముక్కోటి ఆంధ్రులకూ ఎప్పటికీ తీరని అవమానం చేశాడు. ఏదో మన తరఫున మాట్లాడుదామని, మొన్నటిదాకా ఉపవాసం చేసిచేసి నిరసించిపోయిన సాధుపుంగవుడు, సత్యశీలుడు, తెలుగుగాంధీ అంతటివాడు నీళ్లు జల్లుకుంటూ కమండలం పుచ్చుకొని ఢిల్లీకిపోతే నెహ్రూ "ఆబ్బే! నిన్ను చూడ్డానికి నాకు టైములేదు" అన్నాడు. ఎంత అవమానం? కాని ఆ నెహ్రూయే, ఒకదానికి మాత్రం వెంటనే తయారవుతాడు. ఏమిటని అడగవేమోయ్?"

"చిత్తం. అదేమిటండీ?"

"మనను యిదివరకు పాలించిన వైస్రాయి గారి భార్య మౌంటుబాటెనమ్మగారు యిదిగో ఢిల్లీకి వస్తోందంటే, విమానాలాగేవోటికి సైనికుల్ని వెంటబెట్టుకొని వెళ్ళి, ఆవిడ విమానం దిగగానే వాళ్లచేత సలాములు చేయించి మరీ రాజభవనానికి తెస్తాడు. మన దేశంలోంచి

వెళ్ళిపోయిన వాళ్ళను యింత మర్యాద చేయటానికుంది గానీ, మన స్వామిగారితో మాట్లాడ్డానికి ఎందుకు టయిము లేదంట?"

"చిత్తం. మాబాగా సెలవిచ్చారు. కాశీ, గయనుంచి వస్తున్న సాధువులకు, సన్యాసులకు మీయింట్లో మీరు భిక్ష పెట్టుండగా నా కళ్లతో ఎన్నిసార్లు చూడలేదు? మీపాటి లేకపోయిం దాయనకు!"

"సరిగ్గా చెప్పావు. మన అలవాట్లు ఎవళ్ళకొస్తాయోయ్. అందులో నెహ్రూవంటి నాస్తికుడికా?"

"ఆయనకు ఒక స్వాములవారికి భిక్ష పెట్టేటంత ఆస్తికూడా లేదుటండీ?"

"అది కాదోయ్. నాస్తికుడంటే ఆస్తి లేకపోవడం కాదు, దేముడిమీద నమ్మకం లేకపోవటం. లేకపోతే, జ్యోతిష్కులు చెప్పేదంతా అబద్ధాలని యెంత ధైర్యంతో అంటాడు? ఆయనకుతోడు, మన ఊళ్ళో లాగులు విడిచి యింకా పంచలు కట్టటం చేతకాని కుర్రకుంక అంతా తాళాలు వెయ్యటం. వీళ్లందరిపనీ చెప్పేవాడిని మొన్న ఎలక్షనుకు నిల్చొని గెలిచినట్లయితే. ఆపాడు జ్యోతిష్కుడు గ్రహబలం సరిగ్గాలేదు మీరు గెలవటం కష్టం అనబట్టి వీళ్లందరూ బ్రతికిపోయారు."

"చిత్తం. అసలు మీరు ఎలెక్షన్లకు నిలుచుకోవలసింది. తెలియక అడుగుతున్నాననుకుండీ, దేముడులేడనే ఆయనకు వీళ్ళందరూ "జై"లు కొట్టటం యెందుకు? అయినా యెంత గొప్పవాడైతేమాత్రం "దేముడు లేడు" అని పబ్లిగ్గా యెలా అనగలిగాడో?"

"దాని కాయన అనాలా ఏమిటి? ఆయన దేముడి గుళ్లోకి భగవద్దర్శనం కోసం వెళ్ళినట్లు పేపర్లో—నాకు చదువు వచ్చినప్పట్నించీ చూస్తున్నాగా—యెక్కడా లేదు. ఈ వేళ పండిత నెహ్రూ మూడేళ్ళ కుర్రవాడిని ముద్దుపెట్టుకొని పూలదండ మెళ్ళోవేశారు—కార్లో వెళ్తూ చేతులు ఊపారు" అని చిన్న చిన్న పనికిరాని విషయాలు చుట్టూ అంచుల గీతలుగీసి పేపర్లో ఉంటాయిగాని, ఫలానా రోజున ఫలానా హనుమంతుడి గుళ్ళోకి వెళ్ళారని యెక్కడ గాలించినా కనపడదు. ఆయనకే కనుక గుడికి వెళ్ళి దేముడిని కొలిచే అలవాటు ఉంటే, తప్పకుండా పేపర్లో పడేది. అయినా యీ పేపర్లవాళ్లకు యిదొక రోగం. అవగింజను గుమ్మడి కాయంత చేసేస్తారు. మనందరకు మాత్రం పిల్లకాయలంటే ముద్దు లేదూ? నెహ్రూగారి పిల్లలప్రేమ అంత పెద్దగా రాయాలా పేపర్లో?"

"చిత్తం. ఎలాగైనా గొప్పవారు కదండీ. మా రాజు ఎంతో త్యాగం చేశాడంటారు."

"ఇటు చూడు నారాయణా, యిలాంటి కబుర్లు నా దగ్గర చెప్పకు. నాకూ రోజూ లైబ్రరీలో పేపరు చదవటం, పార్కులో రేడియో వింటం అలవాటుంది. ఆయన గొప్ప సంగతి, నాకు మహా గొప్పగా చెప్తున్నావు. ఆయన గొప్పవాడైతే ఎవరికేం లెఖ్ఖ. ఆయన గొప్పతనం ఆయనకే ఉంచుకోమను. అయినా మన వాళ్లందరికీ తలకాయలేకపోతే సరి. ఊరికే అనవసరంగా ఆయన్ను గొప్పచేశారు. ఆయనకూడా, పాపం, అందరూ గొప్పతనం తనకు అంటకడితే, తనూ నిజంగా అంతే అనుకుంటున్నాడు. దేశంలో యీయన్ను మించిన వాళ్లు చాలామంది ఉన్నారు ఇక త్యాగం సంగతి అంటావా? పదేళ్లక్రితం మన ఊరి రైల్వేస్టేషను తగలెట్టినప్పుడు పోలీసులు తుపాకులు కాల్చగా ప్రాణాలే పోగొట్టుకున్న వాళ్లకంటే, యీయన మహా పెద్ద త్యాగం ఏం చేశాడూ అంటాను."

"గట్టిగా అనకండి మంచి 'లా' పాయింట్లు తీసి మాట్లాడుతున్నారు"

"నారాయణా, నీవుకూడా 'క్రిటిసైజ్' చేయటం నేర్చుకోవాలోయ్?"

"ఏదో ఏమీ తెలియని వాడిని. శ్రద్ధగా అన్నీ నేర్పుతామంటున్నారు. అదృష్టవంతుణ్ణి."

"ఏం భయపడక్కర్లేదు. చాలా సులభం. జాగ్రత్తగా వినాలి. ఎవరైనా ఒక మనిషిని గురించిగానీ, ఒక విషయం గురించిగానీ-అది మహత్తరమైనదీ అనుకుందాము-గొప్పగా చెప్తూంటే, చెవుల్తో వింటూ, 'నీవు చెప్పింది నిజంరా బాబూ' అన్నట్టు కళ్లప్పగించి చూడకూడదు. ఆ చెప్తున్నది అయిపో అవక మునుపో

లేక మధ్యలోనో, తకీమని అడ్డుపడాలి. ఫలానా వ్యక్తి గొప్పవాడూ, దేశభక్తుడూ, త్యాగ ధురంధరుడూ అని చెప్ప బడుతున్నా డనుకో. నీవు వెంటనే "ఆ మనిషి సంగతి నాకు తెలుసు లేవోయ్. ఫలానా సంవత్సరంలో ఆ పనిచేసి దేశానికి అప్రతిష్ఠ తెచ్చా డనీ, ఒక విషయం గురించి మాట్లాడుతుంటే, 'అది ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేదు. బుట్ట దాఖలా చేయటం మంచిది' అనేయ్. అంటే నీకిది ఉదాహరణగా చెప్తున్నా నన్న మాట. నీవన్న మాటల్ని సపోర్టు చేసుకోవా లంటే, తప్పైనా కొంచెం తెలివిగా మాట్లాడితే చాలు. దాంతో నలుగురిలో నీవు తలకా యెత్తుకొని తిరగటమే కాదు, నలుగురూ నీవైపు తలెత్తి చూస్తారు. మరి యిన్నాళ్లూ నేనిలా 'లైఫ్'లో కొట్టుకొచ్చా ననుకున్నావ్?

"మొన్న ఎలక్షన ప్పుడు, 'మీవోటు నాకివ్వాలి' అంటూ, ఉపేంద్రగుప్త మనింటికి వస్తే ఝాడించి వదిలిపెట్టాను. "నీకు వోటిచ్చి గెలిపిస్తే, కాంగ్రెసు వాళ్లలాగా మాకు అన్యాయం చేయనని గ్యారంటీ ఏమిటీ" అన్నాను. "నీవు పర్మిట్లు, లైసెన్సులు సంపాదించవని నమ్మకం చూపెట్టూ" అన్నాను. దాంతో మనిషి అరగంట దాకా మాట్లాడ లేకపోయాడంటే నమ్ము. తరువాత నింపాదిగా తెప్పరిల్లి "అలాగంటే ఎలాగండీ?" అంటూ నీళ్లు నములుతూ పోయాడు. ఆ విధంగా "పెక్కి కలర్"గా దబాయించటంలోనే ఉందోయ్ కిటుకు.

నిన్న మన ఊరి రచ్చబండమీద శంకరం మహా డప్పీలు కొట్టున్నాడు. అక్కడున్న ప్రతి గాడిదా శ్రద్ధగా నోరు తెరచుకొని వినే వాడే! నేనూ జాగ్రత్తగా అంతా వింటున్నాను. రాయలసీమలో కరువుగా ఉందనీ కొంతమంది చచ్చిన గొడ్లమాంసం తింటున్నారనీ— కొంత నిజమనుకో— కోసేస్తున్నాడు. నేను చటుక్కున లేచి, 'ఇదంతా పొలిటికల్ స్టంటు. పేపర్లో వ్రాసేటంత తీవ్రంగా ఏం లేదు కరువు.' అన్నాను. అక్కడున్న జనం 'ఆ' అంటూ ఒకేసారి నావైపు తిరిగారు. శంకరంగాడి మొహం చూసినవాడే లేడు."

"మోకగా అన్నారు. నాకుర్రాడా అటువంటి స్టంటు సినిమాలంటే నీ యిష్టం. అయితే బాబుగారూ, మొన్న సీమక్క మావాడు, వాళ్ళ అవ్వ బియ్యం చెరుగుతుంటే దగ్గర కూర్చొని, భూమిసేనలొస్తే యీ కరువు పోతుందనీ, ఎక్కువ ఎకరాలు యింకా పండుతాయనీ అంటున్నాడు. అదేమిటో వివరంగా అడుగుదామనుకున్నాను గానీ, చెప్పొద్దూ- ఆ గుంటవెధవ దగ్గర నేను తెలుసుకునే దేమిటీ అనిపించింది. వాడు చొక్కాకి యెప్పుడూ నాగలి, పళ్ళచక్రం ఉన్న బొమ్మ పెట్టుకొని తిరుగుతూంటాడు."

"అది సోషలిస్టుపార్టీ గోతు లే. వాళ్ళను యీరోజుల్లో ఏ నేవాళ్ళే లేరు నారాయణా. సేనలంటూ యెందుకుంటాయోయ్? రాజ్యాల్ని జయించటానికీ, శత్రువులు దండెత్తివస్తే తరిమి కొట్టటానికీ అవి పనికొస్తాయి. పంటలు పండించడానికి సేనలు కావాలంటే యెవరైనా నవ్వి పోతారు. వీళ్లు పండించకపోగా, వీళ్ళ తిండికి సరిపోక, అవచ్చే కరువేదో త్వరగానే వస్తుంది. ఆ భూమిసేనలు వస్తూ, కరువును కూడా వెంట పెట్టుకొని వస్తాయి. ఇలాంటివన్నీ నీవే అర్థం చేసుకోవాలోయ్. నేను చెప్పేవి గావు. చాలా సింపిల్."

"చిత్రం. ఈవేళ చాలా తెలియని సంగతులు చెప్పారు. మీరు ఆ రేసుముక్కలతో గడ్డం గీక్కునే బదులు, ప్రతి నాలుగు రోజులకూ, యీ రోజు వచ్చినట్టే వచ్చి పోతుంటాను; నా చేతే చేయించుకోండి."

"సరేలే. అలా వస్తూంటే సంగతులు తెలుసుకోవటం వలన నీకు కూడా, జనరల్ సెన్సూ, కామన్ నాలెడ్జీ యెక్కువవుతాయి. ఇవాళతో మూడుంబావలా, జ్ఞాపకముంచుకో."

రాజకీయవేత్త అంటే, ఎవరు?— అంటే, దేశంకోసం నీ, నా ప్రాణాలను త్యాగం చేసెయ్యడానికి సిద్ధపడేవాడు అని- ఓ బుద్ధిమంతుడి నిర్వచనం.